# "గాంధీ మాటల్లోని సత్యాన్ని వెదకిన పరిశోధకుడు-ధర్మపాల్"

రెండవ రౌండ్ టేబుల్ సమావేశాల కోసం లండన్ వెళ్ళిన గాంధీని అక్కడి రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్ (Royal Institute of International Affairs) తమ సంస్థని సంబోధించి మాట్లాడమని పిలిచింది. 20-10-1931న గాంధీ ఆ సంస్థలో మాట్లాడారు. సభకి అనేకమంది బ్రిటిష్ మేధావులు వచ్చారు. లార్డ్ లోథియన్ ఆ సభకి అధ్యక్షత వహించారు. గాంధీ మాట్లాడవలసిన విషయం- "భారతదేశపు భవిష్యత్తు." దానిపై మాట్లాడే ముందు గాంధీ - "హిందూ-ముస్లిం-సిఖ్" ల సమస్య, "అంటరానితనం", "గ్రామాల్లోని పేదరికం" అనే అంశాలని స్పృశిస్తూ, చాలా అలవోకగా, అంతర్వాణి ప్రబోధించినట్టుగా "బ్రిటిష్‌వారు రావడానికి ముందు కంటే ఇప్పుడు నిరక్షరాస్యులు ఎక్కువ వున్నారు", "బ్రిటిష్‌వారు విద్యావ్యవస్థని మెరుగుపరచడం ప్రక్కనవుంచి, దాన్ని సమూలంగా పెకలించి వేశారు. ఓ చెట్టు మొదలును తవ్వి, వేరుని బయటకి తీసి, అలా వదిలేశారు. ఓ అందమైన వృక్షం నాశనమయ్యింది" అన్నారు. చాలా ప్రగాఢ విశ్వాసంతో అవసరమయితే నా ప్రకటనని ఎవరైనా అంకెలతో ప్రశ్నించ వచ్చును అన్నారు.

సభలో అలజడి. బ్రిటిషువారు రాకముందు భారతదేశంలో ఎక్కువ అక్షరాస్యులు ఉన్నారు అన్న గాంధీ మాటలు బ్రిటీష్ వారికి తీవ్రమైన ఆరోపణలుగా తోచాయి. ఇది బ్రిటిష్ సభ్యసమాజాన్ని చాలా తీవ్రంగా కలవరపరచింది. చాలామంది నిశ్చేష్టులై, మౌనంగా వుండిపోయినా, గాంధీ విసిరిన ఈ సవాలుని సర్ ఫిలిప్ హార్టోగ్ అనే వ్యక్తి ఒప్పుకోలేదు. ఈయన ప్రాచ్యదేశాల అధ్యయన సంస్థ School of Oriental Studies స్థాపకుడు, అంతకు ముందు ఢాకా యూనివర్శిటీ ఉపకులపతి, బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో విద్యావ్యవస్థల మెరుగుకోసం 1918-30ల మధ్య వేసిన అనేక కమిటీలకి ఛైర్‌మెన్. ఆ మీటింగ్‌లోనే గాంధీని ప్రశ్నించడమేకాక, దాదాపు ఓ దశాబ్దంపాటు గాంధీని-నీవు చెప్పిన మాటలు ఋజువుచేయి, లేకపోతే బహిరంగంగా నీ మాటలు వెనక్కి తీసుకుని, క్షమాపణ కోరమని వెంటబడతాడు. గాంధీ కూడా తను చెప్పింది తప్పు అని తేలితే తనమాటల్ని వెనక్కి తీసుకుంటాను అని, భారతదేశం తిరిగి వెళ్ళాక దీనికి సంబంధించిన ఆధారాలు బయటపెడతాను అని అన్నాడు. ఇండియాకి తిరిగి రాగానే గాంధీ అరెస్టయి ఎరవాడ జైలులో వుండటం, ఈ విషయమై విషయసేకరణ చేయమని కె.టి.షా ని ఆదేశించడం జరుగుతుంది.

కె.టి.షా హార్టోగ్‌కి గతంలో మాక్స్‌ముల్లర్, లడ్‌లో, ప్రెండర్‌గాస్ట్, థామస్ మన్రో, డబ్ల్యూ. ఆడమ్, జి.డబ్ల్యూ. లీటర్న్... ఇలా అనేకమంది 17, 18 శతాబ్దాల భారత విద్యావ్యవస్థ గురించి చేసిన వ్యాఖ్యానాలు, రిపోర్ట్ లు అధ్యయనాలతో కలిపిన వివణాత్మకమైన ఉత్తరం వ్రాస్తాడు.

కానీ ఎన్ని ఆధారాలు చూపినా హార్తోగ్ ఒప్పుకోక, గాంధీని తన మాటల్ని ఉపసంహరించుకోమని పట్టుబడతాడు. గాంధీ తప్పు చెప్పాడా?

ధర్మపాల్ (1922-2006) గాంధేయవాది. గాంధీ ఆలోచనల గురించి చాలా విస్తృతంగా పరిశోధించి, దాదాపు 16 పుస్తకాలు, 8 విశిష్టమైన వ్యాసాలు, 23 పరిశోధక పత్రాలు, 40 ఉపన్యాసాలు-వ్యాసాలు, ప్రత్యేకంగా మహాత్మాగాంధీపై 9 ప్రత్యేక రచనలు, 10 ఇంటర్వ్యూలు, 25 హిందీ రచనలు చేసిన విశిష్టవ్యక్తి. తన రచనల ద్వారా రామ్‌మనోహర్ లోహియాకి, ఇంకా అనేకమైన గాంధీ అనుయాయులకి గాంధీ గురించి, భారతదేశపు చారిత్రక విషయాల గురించి, ముఖ్యంగా 17, 18, 19 శతాబ్దాల భారతచరిత్ర గురించిన విభిన్న అంశాలు-చరిత్ర, సంస్కృతి, విద్య, సైన్స్, సాంకేతికరంగం ... ఇలా అనేక అంశాలపై పరిశోధించి సాధికారిక పరిశోధనాంశాలను ఆయుధాలుగా ఇచ్చాడు.

19-02-1922 లో ఉత్తరప్రదేశ్‌లోని కంధాలలో జన్మించిన ధర్మపాల్, 1920 చివరికాలంలో లాహోర్ వెళ్ళారు. 7 సంవత్సరాల వయస్సులో భారత జాతీయ కాంగ్రెస్ లాహోర్ సమావేశాలకి నాన్నతో కలసి హాజరయ్యాడు. 1938లో లాహోర్‌లో ఫెర్గ్యూసన్ కాలేజీలో బి.ఎస్.సి. (ఫిజిక్స్)లో చేరి, తరువాత 1940లో బదిలీపై మీరట్ కాలేజీలో చేరారు. 1940లోనే స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కాలేజీ చదువులు వదిలేసి ఉద్యమంలో చేరి, ఆగస్ట్ 8, 1942 క్విట్ ఇండియా సమావేశాలలో పాల్గొని, తరువాత అరెస్ట్ అయ్యి 1943 ఏప్రిల్- జూన్‌లలో పోలీసు కస్టడీలో వున్నాడు. 1944లో మీరాబెన్‌తో కలసి రూర్కీ, హరిద్వార్‌లలో గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 1947 నుండి కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీలో దేశవిభజన సమయంలోని కొందిశీకుల పునర్వికాస కేంద్రాలకు నిర్వాహకుడుగా వున్నాడు. లోహియాతోనూ, కమలాదేవి ఛటోపాధ్యాయలతో కలసి పనిచేశాడు.

1949లో ఫిల్లిస్ ఎల్లెన్ ఫోర్డ్ అనే ఆంగ్ల యువతిని పెళ్ళిచేసుకున్నాడు. 1950లో తిరిగి మీరాబెన్‌తో కలిసి రిషికేశ్ లో సహకార విధానాలపై ఓ గ్రామాన్ని నిర్మించాడు. తిరిగి 1954లో లండన్ వెళ్ళి, 1957లో ఇండియావచ్చి, పంచాయితీ రాజ్ వ్యవస్థపై అనేక పరిశోధనలు చేశాడు. 1965లో బ్రిటన్ తిరిగివెళ్ళి- 17, 18, 19 శతాబ్దాల భారతదేశ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలపై బ్రిటిష్ పాత రికార్డుల ఆధారంగా అనేక పరిశోధనలు చేశాడు. ఇలా మధ్యలో లండన్, తిరిగి ఇండియాలో వుంటూ అనేత ప్రాచ్య, ప్రాశ్చాత్య చారిత్రకాంశాలపై పరిశోధించి- తొలి గ్రంథం "పంచాయతీరాజ్ ఆధారిత భారత రాజ్యవ్యవస్థ" (Panchayat Raj and India Policy) (1962) ప్రచురించారు.

కానీ ఆయన పరిశోధనల్లో అత్యంత చర్చనీయాంశమైన కొన్ని పుస్తకాలు- "18వ శతాబ్దంలో ఇండియాలో సైన్స్ మరియు టెక్నాలజీ" (Indian Science and Technology in the Eighteenth Century - 1971), "సహాయ నిరాకరణ- భారతీయ సాంప్రదాయం," (Civil Disobedience in Indian Tradition - 1971), భారతీయ చిత్త, మానస, కాల

(Bharatiya Chitta, Manasa and Kala - 1991), "గాంధీని అర్థం చేసుకోవడం" (Understanding Gandhi 2003) ... అయితే ఆయన 1983లో ప్రచురించిన "అందమైన వృక్షం- పద్దెనిమిదవ శతాబ్దంలో భారతదేశంలో స్వదేశీ విద్య" (**THE BEAUTIFUL TREE** : Indigenous Indian Education in the Eighteenth Century) ఓ సంచలనాన్నే సృష్టించింది. అది 1931లో గాంధీ రాయల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ అఫైర్స్, లండన్‌లో చెప్పిన మాటని ఋజువుచేసే ప్రయత్నం. విశేషమైన శ్రమతో, విస్తృతంగా ఇండియా, లండన్‌లలోని అనేక ప్రాచీన లిఖిత ఆధారాలను సేకరించి, చదివి, విపులీకరించిన ప్రయత్నం.

ఇరవైయవ శతాబ్దపు తొలినాళ్ళకి భారతదేశంలో జ్ఞానులు, చదువుకున్నవారు, ఇంగ్లీషువారి స్పర్శతోనే భారతీయుల్లో జ్ఞానం ఉదయించింది అని బలంగా నమ్మేవారు. ఇప్పటికీ ఆ ఆలోచన విద్యాధికుల్లో చాలా గాఢంగా వుంది. 1800 నుండి 1900ల మధ్య పుట్టిన మూడు, నాలుగు తరాలు తమ గురించి తాము పూర్తిగా మరచిపోయేలా చాలా విజయవంతంగా చేయగలిగారు బ్రిటిష్‌వారు. ఈ మధ్య కెన్యా నవలా రచయిత, వలసవాదానంతర సైద్ధాంతిక కర్త- న్యూగీ వా థియాంగో (Ngui Wa Thiango) వ్రాసిన Decolonizing the Mind : The Politics of Language ను చదివి ఊగిపోయిన భారతీయ మేధావులకి ధర్మపాల్ అర్థం కాలేదు. ఎందుకంటే బయటినుండి వచ్చే జ్ఞానానికి అలవాటుపడ్డ సగటు భారతీయ చదువరికి, మేధావికీ ధర్మపాల్, గాంధీలు అర్థం అవడం కష్టమే!

మన దుస్థితి ఏమిటంటే మన గురించి మనం తెలుసుకోడానికి బ్రిటిష్‌వారి రికార్డులలో వెతుక్కోవడం. ఆ మధ్య ప్రణబ్ ముఖర్జీ (దివంగత మాజీ భారతదేశ అధ్యక్షులు) పార్లమెంటులో ఆర్థికశాఖామంత్రిగా వుంటూ (08-12-2011న) అప్పటి ఆర్థిక పరిస్థితిపై FDI ల గురించి మాట్లాడుతూ- "ఈ FDI లు లేకముందు మనమేమీ బల్లుల్ని తింటూ వుండలేదు." ("We did't eat lizards when there was no FDI") అన్నారు. అలాగే బ్రిటిషువారు రాకముందు ఈ దేశంలో సైన్స్, టెక్నాలజీ, చదువులు లేవన్న అసంబద్ధ భావనని ప్రశ్నించటడమే ఈ The Beautiful Tree ఉద్దేశ్యం. నిజానికి అదే సమయంలో (సుమారు 1700లలో) భారతదేశ ఆర్థిక, విద్యా, శాస్త్ర, సాంకేతిక రంగాలు ఇంగ్లాండ్ కంటే చాలా ఎక్కువస్థాయిలో వున్నాయి. en.www.wikipedua.org>wiki>economics లో Economic History of India అనే విషయం చదివితే 1700 నాటికి ఇండియా జనాభా 16.5 కోట్లు, GDP (ppp) (1990 Dollars) 9075 కోట్ల డాలర్లు. ఆ నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ. అసలు ఇంగ్లాండ్ ఎదుగుదల అమెరికా, భారత్‌ల, ఆసియా, ఆఫ్రికా దేశాల సహజ వనరుల దోపిడీ ఫలితమే అని లోహియాతో సహా అనేకమంది భారతీయ చింతనాపరులు కూడా చెప్పారు.

## రెండవ భాగం

"18వ శతాబ్దంలో ఇండియన్ శాస్త్ర, సాంకేతికత" (Indian Science and Technology in the Eighteenth Century(1971))లో అనేక ఉదాహరణలతో ఇండియాలోని ఆ కాలపు శాస్త్ర, సాంకేతికతల ఔన్నత్యాన్ని వివరించిన ధర్మపాల్, The Beautiful tree లో 17, 18 శతాబ్దంలో భారతదేశంలో విద్య గురించి సోదాహరణంగా వివరించారు. నిజానికి యూరోప్ అంతటా 17, 18వ శతాబ్దాలనాటికి భారతదేశ వ్యవస్థ గురించి ఉత్సుకత పెరిగి, అనేక అంశాలపై నిజాలు సేకరించే పనిలోపడ్డారు. వోల్టేర్, అబ్బే రేనాల్, జోన్ సిల్వెయిన్ లే కాక, ఆడమ్ ఫెర్గ్యూసన్, విల్లియమ్ రాబర్ట్సన్, జాన్ ప్లేఫెయిర్‌లు (ఎడింబర్గ్ విశ్వవిద్యాలయం) కూడా చాలా వివరాలు సేకరించారు. అదే సమయంలో చార్లెస్ విల్కిన్స్, విల్లియమ్ జోన్స్ ...తదితరులు సంస్కృతం, ఇతర భారతీయ భాషల అధ్యయనంపై మక్కువ పెంచుకున్నారు.

విల్లియమ్ ఆడమ్స్ అనే అతను 1830లలో బెంగాల్, బీహారులలో సర్వేచేసి- ఈ ప్రాంతాలలో సుమారుగా 1,00,000 గ్రామ పాఠశాలలు ఉన్నాయని చెప్పారు. తరువాతి కాలంలో చాలామంది బ్రిటిష్ విధాన రూపకర్తలు ఈ నిజాన్ని తిరస్కరించడానికి చాలా కష్టపడ్డారు. ఆడమ్స్‌కు ముందే మద్రాస్ ప్రెసిడెన్సీ గురించి థామస్ మన్రో "ప్రతి గ్రామానికి ఓ పాఠశాల వుంది" అని వ్రాశాడు. బాంబే ప్రెసిడెన్సీ గురించి జి.ఎల్. పెండెర్‌గాస్ట్ అనే బ్రిటిష్ అధికారి కూడా 1820లలో "ఈ ప్రాంతం మొత్తంలో కనీసం ఒక్క పాఠశాల కూడా లేని చిన్నా, పెద్ద గ్రామం లేదు. పెద్ద గ్రామాలలో ఇంకా ఎక్కువే వున్నాయి" అని రిపోర్టు చేశాడు. 1850లలో పంజాబ్ ప్రాంతంపై పరిశోధించిన డా.జి.డబ్ల్యు. లీట్నర్ ఇలాంటి స్థితినే గమనించాడు. ఈ రిపోర్టులు చూసిన మిషనరీ అధికారులు వీటిని చాలా తీవ్రమైన అసత్యాలుగా తిరస్కరించడం మొదలుపెట్టారు. ఎందుకంటే తెల్లవాడే ఉన్నతుడు అనే భావన వారిని కమ్మేసింది. ఆ సమయానికి ఇంగ్లాండ్‌లో చాలా తక్కువ స్కూళ్ళు, చాలా తక్కువ విద్యార్థులు !

ఉదాహరణకి తెలుగు మాట్లాడే ప్రాంతాలలో సుమారు 1823 ఆ ప్రాంతాలలో 3,454 స్కూళ్ళు, 32,801 మంది విద్యార్థులు, అలాగే 606 కళాశాలలు, 2592 మంది విద్యార్థులు ఉన్నారు అంటే మనం నమ్మగలమా ఈ రోజు? అలాగే కులాలపరంగా చూస్తే 13,893 (బ్రాహ్మణులు), 121 (క్షత్రియులు, రాజులు) 7676 (వైశ్యులు), 10,076 (శూద్ర), 4,755 (ఇతర కులాలు), 1,639 (ముస్లింలు) విద్యార్థులుగా వున్నారు అని గణాంకాలు చెబుతున్నాయట! టేబుల్ I & II, పబ్లికేషన్స్ డివిజన్, 2015, Essential Writings of Dharmapal, పబ్లికేషన్స్ డివిజన్, 2015, P. 212-13 (ఇది బ్రిటిష్ అధికారులు బ్రిటిష్ ప్రభుత్వానికి ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా తయారుచేసినవని ధర్మపాల్ వివరణ). బ్రిటిష్‌వారు రావడానికి ముందు కేవలం ఉన్నతకులాలు, తరగతులకే విద్య పరిమితమైందని సాధారణంగా నమ్మే భారతీయ మేధావులకు ఈ లెక్కలు కొంత జీర్ణమవడం కష్టమే ! ఇలా ఈ పుస్తకాలలో పురుష, స్త్రీల లెక్కలూ ఉన్నాయి. అలాగే కనీస వయస్సు, విద్యాకాలం చదివే సబ్జెక్టులూ

ఉన్నాయి. రామాయణం, భారతం, భాగవతం కామన్ సబ్జెక్టులుగావున్నా, విద్యార్థుల సామాజిక నేపథ్యంబట్టి- విశ్వకర్మ పురాణం లాంటి ఇతర విషయాలు (ఉత్పత్తి కులాల విషయంలో), చెన్న, బసవపురాణం తదితరాలు(లింగాయతు పిల్లలకి), పంచతంత్ర ఇత్యాదులు, నిఘంటువులు, వ్యాకరణాలు పాఠ్యాంశాలుగా ఉండేవని తెలుస్తోంది. మొల్ల రామాయణం, దాశరథీ శతకం, సుమతీ శతకం ఇత్యాదులు పాఠ్యాంశాలుగా వున్నట్టు తెలుస్తోంది.

అలాగే ఉన్నత విద్యలలో ఎక్కువగా బ్రాహ్మణాధిక్యం ఉన్నా అవి కేవలం మత, తత్త్వ, నీతి, న్యాయశాస్త్రాల వరకు పరిమితం అనీ, ఖగోళశాస్త్రం, వైద్యం లాంటి శాస్త్రాలు అన్ని కులాల, వర్గాలవారు దాదాపు సమానంగ చదివినట్టు ధర్మపాల్ చెబుతున్నారు. 1812ల ప్రాంతంలో మలబారు, మద్రాసు ప్రాంతాలలో 808 మంది ఖగోళశాస్త్రం చదువుతూంటే కేవలం 78 మంది, 194 మంది వైద్యశాస్త్రం చదువుతూంటే 31 మంది మాత్రమే బ్రాహ్మణులనీ, మిగతావారు అన్యకులస్థులనీ ధర్మపాల్ చెబుతున్నారు. (అదే పుస్తకం, పేజీ.221) శస్త్రచికిత్సలో ఎక్కువమంది మంగలికులం వారు గొప్పపనితనం ఉన్నవారని ఆ కాలపు బ్రిటిష్ వైద్యనిపుణులు భావించినట్టూ తెలుస్తోంది.

అలాగే స్త్రీల విద్య విషయంలోనూ అప్పటి మలబార్, జోయపూర్ (విజయనగరం) ప్రాంతాల గణాంకాలనుబట్టి ప్రాథమికవిద్యలో బ్రాహ్మణుల పురుష- స్త్రీ నిష్పత్తి సూచిక 2230-5, వైశ్యులలో 84-13, శూద్రులలో 3697-707, ఇతరులలో 2756-343, ముస్లింలలో 3196-1122 (మలబారు ప్రాంతం), అలాగే జోయ్‌పూర్ ప్రాంతంలో 254-941 (బ్రాహ్మణ), 38-01 (వైశ్య) 266-71 (శూద్ర) 213-64 (ఇతర) మరియు 0-0 (ముస్లిములు)గ వుంది.

అయితే గాంధీగారి మాటల్లోని సత్యాలని వెదికే ప్రయత్నం ధర్మపాల్‌గారు కేవలం విద్యకు మాత్రమే పరిమితం చేయలేదు. బ్రిటిష్‌వారు రావడానికి ముందు ఆర్థిక, రాజకీయ వ్యవస్థలని, సైన్సు, టెక్నాలజీలని, పంచాయతీ వ్యవస్థనీ ... ఇలాగే అనేక అంశాలని స్పృశిస్తూ, ఆనాటి యూరోప్‌తో పోల్చుకుంటే అనేక రంగాలలో ఇండియా ఉన్నత స్థితిలో ఉందని, బ్రిటిష్‌వారి వివక్షతో కూడిన విధానాలు తరువాతి కాలంలో అనేక రంగాలని భయంకరంగ దెబ్బతీశాయనే నిజం, కొంచెం కటువుగా వున్నా సరే, మనకు తెలుపుతోంది.

ధర్మపాల్ రచనలు 5 భాగాలుగా దొరుకుతున్నా, భారతప్రభుత్వపు అధికార ప్రచురణగా Essential Writings of Dharmapal అనే పేరుతో పబ్లికేషన్ డివిజన్ వారు 2015లో వేశారు. భారతదేశాన్ని తిరిగి అర్థం చేసుకునే అనేక పుస్తకాలు ఈ మధ్య వస్తూన్నాయి. కానీ ఆ సాహిత్యపు తొలి మార్గనిర్దేశకులలో ధర్మపాల్ ఒకరు. చక్కని గాంధేయవాది. అలాగే పండిత్ సుందర్ లాల్ అన్న వ్యక్తి కూడాను. న్యూగీ వా థియాంగో, ఫ్రాంజ్ ఫెనాన్‌లను ఊకదంపుడు ఉపన్యాసాలుగ, వ్యాసాలుగా దేశంపై వదిలే జ్ఞానులు ధర్మపాల్ రచనలపట్ల మాత్రం చాలా విచిత్రమైన మౌనం వహిస్తారు. ఎందుకంటే ఇప్పటికీ చాలామందిలో, బయటికి ఎన్ని చెప్పినా,

ఆ వలసవాదం సృష్టించిన మనస్తత్వాలే బలంగా ఉన్నాయి. ఇప్పటికైనా ఈ మేధావులు భారతదేశ చరిత్రని, ముఖ్యంగా గత 2 లేదా 3 వందల సంవత్సరాల చరిత్రని తిరిగి చదవాల్సిన అవసరం వుంది అని గాంధేయ వాది ధర్మపాల్ గుర్తు చేస్తున్నారు.

క్లాడ్ అల్వేర్స్ అనే గోవాకు చెందిన పర్యావరణ వేత్త, విద్యార్థిగా 1976 ప్రాంతంలో హాలండ్ లో పశ్చిమ దేశాల్లో, చైనాలో, ఇండియాలో శాస్త్ర విజ్ఞానం, సంస్కృతి అనే అంశాలపై తులనాత్మక పరిశోధనగా తన పిహెచ్.డీ. చేస్తున్నారు. ఆయనకి హాలండ్ లోని గ్రంథాలయాల్లో అన్ని అంశాలపై కొంత విషయం దొరికినా, ఇండియా గురించి ఏమీ దొరకటం లేదు. అకస్మాత్తుగా ఒక రోజున ఆమ్ స్టర్ డామ్ లోని South-East Asia Institute లో ధర్మపాల్ వ్రాసిన ఇండియన్ సైన్స్ అండ్ టెక్నాలజీ... పుస్తకం దొరకడంతో ఆయన పిహెచ్.డి. విజయవంతంగా చేయగలిగారు. ఆయన డాక్టోరల్ థీసిస్ ద్వారా ప్రభావితమైన కొంతమంది మద్రాస్-కాన్పూర్ ఐ.ఐ.టి. విద్యార్థులు ఆయన ద్వారా ధర్మపాల్ గురించి తెలుసుకున్నారు. ఈ విద్యార్థులు చాలా కాలం దేశీయ సాంకేతికత పై గొప్ప పరిశోధనలు చేశారట. అలా ధర్మపాల్ అనేక శాస్త్ర పరిశోధనలకు తోడ్పడ్డారు. అలాగే హెలైన్ సెలిన్ అనే అమెరికన్ లైబ్రేరియన్, సైన్సు చరిత్ర కారిణి వెలువరించిన Encyclopaedia of Non-Western Science, Technology and Medicine (1997) అనే పుస్తకంలో ధర్మపాల్ ప్రస్తావన వుంది. కానీ భారతీయుల్లో చాలా తక్కువ మందికే ధర్మపాల్ తెలుసు.

బ్రిటిష్ వారు రాకముందే మా విద్యావ్యవస్థ బాగుంది అనే 1931లోని గాంధీజీ మాటను ఋజువు చేసిన ప్రయత్నం చాలా ప్రశంసనీయం. The Beautiful Tree పుస్తకం దాదాపు 420 పేజీల విస్తృత పరిశోధనా పత్రం. 17-18వ శతాబ్దాల అనేక బ్రిటీష్ - ఇండియన్ అధికారులను పరిశీలించి, పరిష్కరించి, ప్రకటించిన ఈ పుస్తకం గాంధీ మాటల్లోని సత్యాన్ని నిలబెట్టింది. గాంధీ ప్రధాన భూమిక సత్యం. మరి గాంధీ మాటల్లోనే సత్యాన్ని వెదకడం అంటే ఎంత సాహసం. కానీ ఆ ప్రయత్నంలో చాలా వరకు సఫలీకృతులయ్యారు ధర్మపాల్.

డా. అవధానం రఘుకుమార్

9441015709